వెన్నుపోటుకు బాబు బ్రాండ్ అంబాసిడర్

• ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: వెన్నుపోటు, మోసాలు, అబద్ధాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. కలిగిరిలోని అవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో వ్యవసాయ, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ అంటూ సూపర్‌సిక్స్ హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మరోమారు ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు నైజాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు, ప్రస్తుతం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీలు పాలూరు మాల్యాద్రిరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటం రవీంద్రారెడ్డి, రేవునూరి శ్రీనివాసులురెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, చిమ్మిలి రవీంద్ర, మండలపు తిరుపతినాయుడు, ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలీ అహ్మద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దేగా వంశీయాదవ్, సీనియర్ నాయకులు పల్లాల కొండారెడ్డి, బొల్లినేని వెంకట సత్యనారాయణ, చిమ్మిలి రాజేంద్ర, కూనిపోగు ఇర్మియా పాల్గొన్నారు.


కలిగిరిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సుపరిపాలన ప్రచారం బూటకం

జలదంకి: సుపరిపాలనలో తొలి అడుగు అంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అంతా బూటకమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. జలదంకిలోని పద్మావతి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై మండల వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట కూటమి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నాయకులు పీ మాలకొండారెడ్డి, సీ హరిబాబురెడ్డి, కే రవిరెడ్డి, వీ మాధవరెడ్డి, ఎస్ వెంకటశేషారెడ్డి, టీ ఇందిరమ్మ, కే రామిరెడ్డి, టీ సతీష్‌నాయుడు, ఆర్ ప్రసాద్‌నాయుడు, జీ జగ్గయ్య, బీ కృష్ణారెడ్డి, డీ రమేష్‌రెడ్డి, వీ బాలయ్య, వీ మహేశ్వరరెడ్డి, టీ భాస్కర్‌రెడ్డి, సీహెచ్ మస్తాన్‌రెడ్డి, జీ సుబ్బారావు, డీ శివారెడ్డి, పీమాల్యాద్రి, వీ లక్ష్మీనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలిగిరిలో సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


జలదంకిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మేకపాటి

బూటకపు హామీలతో చంద్రబాబు మోసం

• కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, అంతకంటే ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామంటూ బూటకపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై దగదర్తిలో మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా అక్రమ కేసులను బనాయించి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రతిఒక్కరికీ అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు మోసాన్ని ఎండగట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పనులు, జగనన్న లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తే కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని మండల టీడీపీ నాయకుడు విమర్శలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దగదర్తి మండలం నుంచి తరలిస్తున్న గ్రావెల్ ఎటు పోతోందని, ఇప్పుడు కోట్లాది రూపాయల మాఫియా జరుగుతున్నా ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను ఇప్పుడు చేపడుతూ తామే మొత్తం చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దగదర్తి–మంగమూరు చానల్, దగదర్తి–రాచర్లపాడు కెనాల్, దగదర్తి–బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు పనులు తమ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టగా ఇప్పుడు వాటిని మేమే చేస్తున్నామని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కావలిలోని ముసునూరులో కోట్లాది రూపాయల మనీ స్కామ్ జరిగిందని, బాధితులు తమకు న్యాయం చేయమని మొరపెట్టుకున్నా ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలనతో చెరగని ముద్రవేసుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. త్వరలో దగదర్తి మండల కమిటీలను నియమిస్తామని తెలిపారు. అనంతరం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి విడుదల చేశారు. మండల నాయకులు వెలినేని మహేష్ నాయుడు, చింతలబోయిన వెంకటేశ్వర్లు, గోగుల వెంకయ్య, అనిల్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి, వట్టికాల మాధవరావు, అల్లం రమణయ్య, అల్లం వెంకయ్య, మంద అశోక్, దగదర్తి శేఖర్ నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



సంగం: స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్ సమీపంలోని మాతా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బెల్టుషాపుల చర్యలు తీసుకోవాలని వినతి

దుత్తలూరు: మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ యనమల నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్టుషాపులతో పేదల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ఇటీవల దుత్తలూరులోని ఏసీ కాలనీలో అల్లుడు మద్యం మత్తులో అత్తామామలను హత్యచేశారని గుర్తుచేశారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకుని పేదల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు, బర్రె అర్జున్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

వరికుంటపాడు: జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా వరికుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది డెంగీపై సోమవారం అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడడంతో పాటు దోమల నివారణకు ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

కలిగిరి: అన్నదాత సుఖీభవకు అర్హత కలిగి ఉండి అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు బుధవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం గిరీష్ సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఉంచిన అర్హుల జాబితాలో పేర్లు లేని వారు గ్రామ సచివాలయం లేదా తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాసుపుస్తకం జెరాక్సులను అందజేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదు

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. మాముడూరు, తూర్పుపల్లి, ఎన్వీకండ్రిక ఉన్నత పాఠశాలలతో పాటు 23 ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను యూటీఎఫ్ నాయకులు కలిసి సభ్యత్వాలను నమోదు చేశారు. జిల్లా కార్యదర్శి నాగినేని రమణయ్య, మండల నాయకులు ఆర్వీ కృష్ణారెడ్డి, రవిబాబు, సుబ్రహ్మణ్యం, సునీల్, మస్తాన్‌బాషా, సాధిక్, చిట్టిబాబు, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆత్మకూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ ఎం గంగాధర్ సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాలు జరిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. బ్యాంకుల నుంచి లేదా ఇళ్ల నుంచి పెద్ద మొత్తంలో నగదును తీసుకుని వెళ్లే క్రమంలో ఎవరైనా వెంబడిస్తున్నట్లుగా అనుమానం కలిగితే పోలీసుల రక్షణ పొందాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవచూపాలి

దుత్తలూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్‌లు తమ పంచాయతీల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. బ్రహ్మేశ్వరం సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు మాట్లాడుతూ తమ గ్రామం నందిపాడు పశువైద్యశాల పరిధిలో ఉండడంతో పశువైద్యసేవలు పొందేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దుత్తలూరు పశువైద్యశాల పరిధిలోకి మార్చాలని కోరారు. మరికొందరు సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాగానే పంచాయతీలకు నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యనమల నాగరాజు, ఎంపీడీఓ హనుమంతరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సభ దృష్టికి సమస్యలను తీసుకొస్తున్న సర్పంచ్ సుబ్బరాయుడు

వైభవంగా గంధ మహోత్సవం

ఉదయగిరిరూరల్: పట్టణ సమీపంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న నిజాముద్దీన్ ఔలియా వారి దర్గాలో గంధ మహోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని హక్కుదారుల ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మర్రిపాడు: మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో జీలుగలు 120 క్వింటాళ్లు, పిల్లిపెసర్లు 25 క్వింటాళ్లు, జనుములు 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎన్ కవిత సోమవారం తెలిపారు. జీలుగలు కిలో రూ.61.5, పిల్లిపెసర్లు కిలో రూ.72, జనుములు కిలో రూ.55కు అందజేస్తున్నట్లు వివరించారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



చేజర్ల(సోమశిల): సమాజంలో చోటు చేసుకుంటున్న మోసాలపై బాలికలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. చేజర్ల మండలం పెరుమాళ్లపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, బాలికల హక్కులు, భద్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

2 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ఆత్మకూరు: ఆగస్టు 2వ తేదీ నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌కు ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం నిరవధిక సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు, ఆఫీస్ సిబ్బందికి, పార్కు కూలీలకు వేతనాలు పెంచాలని, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, కార్మికులకు సంబంధించిన 6డీఏ, సరెండర్ లీవు, ఎన్‌క్యాష్‌మెంట్ విడుదలలో జాప్యం లేకుండా చూడాలని, మరణించిన , ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియోలు చెల్లించడం, పనులు కల్పించాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా సానుకూలంగా స్పందించలేదన్నారు. ఆగస్టు 1వ తేదీ వరకు ప్రభుత్వానికి చట్టబద్ధంగా గడువు ఇచ్చామని, 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు బీ హజరత్తయ్య, ఎం చెంచయ్య, డీ వాసు, కే నాగేంద్ర, కుంటా పెంచలయ్య, సీపీఐ కార్యదర్శి మధు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, పెంచలయ్య, సుభాన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

ఉదయగిరి: రెండు మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉదయగిరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు స్కూటీపై దుత్తలూరు వైపు వెళ్తున్నాడు. అలాగే విజయ్ అనే వ్యక్తి దుత్తలూరు నుంచి ఉదయగిరి వైపునకు మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. రెండు వాహనాలు ఉదయగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నెల్లూరుకు తరలించారు. పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

బస్సులో నుంచి జారిపడి ..

సీతారామపురం : బస్సులో నుంచి జారిపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సీతారామపురం–పోరుమామిళ్ల ఘాట్‌రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని నారాయణప్పపేటకు చెందిన ఎర్రపాళెం రోశయ్య పనిమీద వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు బద్వేలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఫుట్‌బోర్డుపై నిలబడ్డాడు. ఘాట్‌రోడ్డులో బస్సు మలుపు తీసుకుంటున్న క్రమంలో రోశయ్య పట్టుతప్పి జారి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని తోటి ప్రయాణికులు బస్సులో కొంత దూరం తీసుకెళ్లి 108 వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడిన రోశయ్య

పరామర్శ

కావలి (జలదంకి): కావలిలోని 23వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కనపర్తి రాజశేఖర్ మాతృమూర్తి ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంగళరావు నగర్‌లోని కనపర్తి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆశీర్వచనం

కావలిలోని కందుకూరి వైద్యశాల చైర్మన్ డాక్టర్ రామస్వామి కుమారుడి వివాహం సోమవారం చెన్నైలో జరిగింది.మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలోని రామస్వామి నివాసానికి వెళ్లి వధూవరులు వెంకట సౌరవ్, రచనను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

వింజమూరు(ఉదయగిరి): బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని వింజమూరులోని వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ వింజమూరు మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

•బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని కొండాపురంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కొండాపురం మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్ ఆవిష్కరణ నేడు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే, ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో ఆత్మకూరులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆర్థిక సాయం



జలదంకి: ఇటీవల జలదంకిలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన పోట్లూరి శివ కుటుంబాన్ని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించి రూ.10 వేలు నగదు సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నాయకులుఉన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.210

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.210.50 లభించింది. జనరల్ క్లస్టర్ రైతులు 633 బేళ్లను తీసుకురాగా, 510 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.210.58 ధర పలికిందని తెలిపారు.

డీసీపల్లిలో 559 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 559 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 822 బేళ్లు రాగా, 559 బేళ్లను విక్రయించామని చెప్పారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.159, సగటున రూ.205.38 ధర పలికిందని వివరించారు.

అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించాలి


సోమశిల: సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆత్మకూరు/సోమశిల: అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు, అనంతసాగరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సీడీపీఓలు సునీలత, పద్మావతికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వివిధ రకాల యాప్‌లను అప్పగించి పనిభారం మోపుతున్నారన్నారు. ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో ఫేస్ క్యాప్చర్ ద్వారా సరుకులు ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 5జీ ట్యాబ్‌లు అందించి యాప్‌లతో కలిగే పనిభారం తగ్గించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, అంగన్‌వాడీ యూనియన్ నేతలు సునీత, లక్ష్మి, నాగమణి, వసుంధర,జ్యోతి, అరుణ, ఆదిలక్ష్మి నూర్జహాన్, పద్మ, ఆత్మకూరు ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పీ రాధ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కావలి (జలదంకి): మండలంలోని సిరిపురం, చలంచర్ల గ్రామాల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, బీటీరోడ్లు, శ్మశానవాటిక అభివృద్ధి, తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు. కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో రైతాంగానికి సోమశిల జలాలు అందిస్తామన్నారు. సిరిపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కావలి ఏఎంసీ చైర్మన్ పీ అలేఖ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అల్లూరు: అల్లూరు మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ రజనికాంత్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కమిషనర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ హేయం

సీతారామపురం: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమంగా మద్యం కేసును బనాయించి అరెస్ట్ చేయడం దారుణమని జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దుకృష్ణమరాజు ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఏదోక విధంగా వైఎస్ జగన్‌పై బురదజల్లుతూ చుట్టూ ఉన్న వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కాం అనేది అభూత కల్పనేనని, వైఎస్ జగన్‌ను బలహీనపరచాలనే కుట్రతో కూటమి పెద్దలు పన్నాగం పన్నడం హేయమైన చర్య అన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

సోమశిల సోమశిల బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ శాఖ ఏ ఈ సురేష్ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ యోజనపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం మూడు కిలోవాట్ల సామర్థ్యానికి రూ.78వేలు సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు.

రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన

సీతారామపురం : రోడ్డుకు అడ్డుగా గోడ కట్టడం వలన తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తమకు రహదారి సౌకర్యం కల్పించాలని స్థానిక వాల్మీకి కాలనీవాసులు కోరారు. సోమవారం వారు నిరసన తెలిపారు. కాలనీకి చెందిన ప్రధాన రహదారులు ఆక్రమణకు గురై కుంచించుకుపోవడంతో వాహనాల్లో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఏడు వినతులు అందాయి. తహసీల్దారు పద్మజాకుమారి వినతులను స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

24న బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం

సీతారామపురం : స్థానిక రామిశెట్టి తిరుపతయ్య షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఈ నెల 24న ఉదయం 9.30 గంటలకు బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఆక్రమణలు తొలగించి హద్దులు చూపాలని వినతి

ఉదయగిరి: తమకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలను ఓ వ్యక్తి ఆక్రమించి అక్రమంగా జామాయిల్ సాగు చేశాడని, వాటిని తొలగించి తమ స్థలాలకు హద్దులు చూపాలని పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులు కోరారు.ఈ మేరకు ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ సమీపంలోని మోడల్ కాలనీ లేఅవుట్‌లో 1225 సర్వే నంబరులో సుమారు 40 మంది పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసిందని తెలిపారు. అయితే స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి కంచె వేసి జామాయిల్ సాగు చేశాడని తెలిపారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుని హద్దులు చూపితే ఇళ్లు నిర్మించుకుంటామన్నారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు